‘దివ్యాంగుల’పై చిన్నచూపు...

- కాలనీని పట్టిపీడిస్తోన్న సమస్యలు..
- హామీలిచ్చి నెలలు గడిచినా అమలుకు నోచని వైనం
- పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకొచ్చిన ఎక్కడికక్కడే..



పిచ్చిమొక్కలతో దివ్యాంగులకాలనీ రెండో వీధి

నగరంపాలెం: నగరంలో పలు కాలనీలపై చిన్న చూపు కనిపిస్తోంది. మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. అభివృద్ధి పరుగులంటూ హడావుడే కానీ వాళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదు. అందులోనూ ఒక కాలనీలో కొన్ని వీధులపై ఉన్న శ్రద్ధ మిగతా వీధులపై ఉండటం లేదు. మట్టి రోడ్లపై నడవలేకపోతున్నారు. సమస్యలు చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. 21వ డివిజన్‌లోని వికలాంగుల కాలనీ దుస్థితి ఇదీ.

ఇళ్ల ముందు సిమెంట్ గచ్చులు..

జీఎంసీ పరిధిలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో ఏడు వీధులు ఉంటాయి. గత ప్రభుత్వ పాలన హయాంలో ఐదు వీధుల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెండు, మూడు వీధులు ఇప్పటికి మట్టిరోడ్లుగా దర్శనమిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా స్థానిక మహిళలు ఏకమై, ఎమ్మెల్యే గల్లా మాధవి దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులకు అంచనా వేయించి పనులు ప్రారంభిస్తామని వారికి హామీ ఇచ్చారు. నెలలు గడిచినా ఇంత వరకు రోడ్ల ఊసెత్తడంలేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. దీంతో మూడో వీధిలో ఎవరి ఇంటి ముందు వారు సిమెంట్ గచ్చులు వలె నిర్మించుకున్నట్లు వారు తెలిపారు. సైడు కాల్వలు సరిగా లేవు. పూడికతీత పనులు సరిగా నిర్వర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు దగ్గర్లో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఉండటంతో వాహనాల రాకపోకలు సాగుతాయి. దీంతో రహదారులు మరింతగా కుంగిపోతున్నాయని చెబుతున్నారు.

డంపర్ బిన్ తొలగించాలని..

విద్యుత్ ఉప కేంద్రం సమీపంలో చెత్త డంపర్‌బిన్ ఏర్పాటు చేశారు. దీంతో చుట్టుపక్కల చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి అందులో వేస్తున్నారు. సక్రమంగా పారిశుద్ధ్య కార్మికులు తొలగించకపోవడంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల తమ ఇంట్లో వారికి డెంగీ వచ్చిందని ఓ మహిళ వాపోయింది. పెళ్లి అయ్యి 15 ఏళ్లు గడిచిన, అప్పటికి ఇప్పటికి అలాగే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉప కేంద్ర అనుకుని ఉన్న మురుగు కాల్వ మరింత అధ్వానంగా తయారైంది. అందులో మురుగునీరు ముందుకు కదలక అక్కడే నిలిచిపోతుంది. దీంతో దోమలు మరింతగా వ్యాప్తి చెందుతున్నాయి. ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు మరింత ఎత్తుగా పెరిగాయి. దీనికి తోడు అక్కడ ఓ విద్యుత్తు దీపం ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదు. రాత్రివేళల్లో మద్యం తాగి అలజడి సృష్టిస్తున్నారు. భయాందోళనకరంగా ఉంటుంది.



పచ్చని చిన్న మొక్కలు, చెత్త చెదారంతో మురుగు కాల్వ

రాకపోకలకు ఇబ్బందిగా..



మట్టి రోడ్లు కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షకాలమైతే నడిచేందుకు వీలు పడదు. ఈ కాలనీలో మిగతా రహదారులను సిమెంట్ రహదారులుగా ఏర్పాటు చేశారని, కానీ ఈ రెండు వీధులపై పెద్దగా శ్రద్ధ వహించడంలేదు. స్థానికులు అనేకమార్లు పాలకుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా రహదారుల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నాం.

–సిహెచ్.రాజేష్, స్థానికుడు

కదలని మురుగు..



విద్యుత్ ఉప కేంద్రానికి అనుకున్న ఉన్న మురుగు కాలువ పూడి పోయింది. కాలువకు రెండు వైపులా సిమెంట్ గోడల్లేవు.. దీంతో మురుగునీరు అక్కడే ఉండిపోతోంది. శుభ్రం చేసే వారు అరకొరగా వస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌తో ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లకు దూరంగా ఏర్పాటు చేయాలని అనేకమార్లు విన్నవించిన ఎవరూ పట్టించుకోవడం లేదు. దోమల దాటికి అంటువ్యాధులు వస్తున్నాయి.

–సామ్రాజ్యం, స్థానికురాలు

క్లుప్తంగా

అలరించిన అలనాటి సినీ సౌరభాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై ఆదివారం మహతి స్వరసుధ రజతోత్సవాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు పత్రి నిర్మల ఆధ్వర్యంలో జరగ్గా, గాయనీ గాయకులు సిహెచ్.రాజ్యలక్ష్మి, జరీనా, వై.హేమమాలిని, డాక్టర్ జె.ముకుంద ప్రియ, టి.రమాదేవి, వి.రాజేశ్వరిదేవి, జె.రేష్మ, ఎస్.కృష్ణ, నాగపల్లవి, ప్రద్యుమ్న తదితరులు అల నాటి సినీ సౌరభాలను అలపించారు. శ్రోతలను అలరించాయి. కీబోర్డుపై కె.రవిబాబు, తబలపై ఎస్.వెంకట్, ప్యాడ్స్‌పై వి.ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహారావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కోటా సాంబశివరావు, పట్టస్వామి గోపాల కృష్ణమూర్తి, కొడాలి వీరభద్రరావు పాల్గొనగా, కార్యక్రమాలను కె. మదన్ మోహన్ నిర్వహించగా, వ్యాఖ్యతగా బి.కృష్ణప్రసాద్ వ్యవహరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: అందరూ ఉండి అనేక మంది కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నారని, ఒంటరిగా ఉండే వయో వృద్ధులు, దివ్యాంగులకు ఇతోధికంగా సహాయ సహకారాలు అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా సమితి ద్వారా వందలాది మందికి ఉచితంగా సేవలు అందిస్తున్నామని అన్నారు. దాతల సహకారాలతో మరెన్నో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్పీ.రమణ, సహాయ కార్యదర్శి పలకలూరి శివరావు, మాజీ అధ్యక్షుడు నేరెళ్ల కొండలరావు, మామిడి వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై వ్యాఖ్యలు సిగ్గు చేటు



నెహ్రూనగర్: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై వ్యక్తిగత అంశాలపై అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటు అని జాతీయ మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం లాడ్జిసెంటర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీవీ సునీల్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమని చెప్పారు. సునీల్ వ్యక్తిగత విషయాల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దళితుల కుటుంబాలకు చెందిన వారు విదేశాలకు వెళ్లకూడదా..ఉన్నత విద్య చదవకూడదా అని సూటిగా ప్రశ్నించారు. ఆయన గురించి ఈ సారి అవాకులు చవాకులు పేలితే ఉద్యమిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు చైతన్య, విద్యాసాగర్, శేషయ్య, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేకం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీమారుతీ దేవాలయం, శ్రీరామ సేవా సమితి (వారణాసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా, శ్రీమద్ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ అష్టోత్తర శత పారాయణ పూర్వక శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి సపరివార సమేతంగా అభిషేకం చేపట్టారు. ఈ అభిషేకం నదుల నీళ్లు అని సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో వేద పండితులతో వివిధ సూక్తముల పారాయణం నడుమ నిర్వహించారు. పారాయణదారులందరూ హాజరవ్వగా, భక్తులకు అన్న ప్రసాదం చేశారు. పాలక మండలి సభ్యులు కొరపాటి రామారావు, శ్రీరామ సేవాసమితి నిర్వాహకులు డాక్టర్ యూవీ సోమయాజులు పాల్గొనగా, కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ముగిసిన గుంటూరు కళాపరిషత్ వార్షిక నాటకోత్సవాలు



నగరంపాలెం: శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గుంటూరు కళాపరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం), గుంటూరు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో దివంగత నటుడు రక్త కన్నీరు సి.నాగభూషణం నట ప్రస్థానంపై సదస్సు నిర్వహించారు. గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బయ్య సభాధ్యక్షత వహించారు. వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు పాల్గొనగా, సదస్సులో నాగభూషణం– ప్రజా నాట్యమండలిపై ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, నాగభూషణం– నాటక రంగంపై ప్రముఖ రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, నాగభూషణం– సినిమా రంగంపై ప్రముఖ సీనియర్ పాత్రికేయులు రెంటాల జయదేవ కళారంగంలో నాగభూషణం కృషిని వివరించారు. కార్యక్రమంలో నాగభూషణం పెద్ద కుమారుడు చుండి రాఘవరావు, బంధువు రమేష్, కళాపరిషత్ అధ్యక్షుడు పి.వి. మల్లికార్జునరావు, వల్లూరు తాండవకృష్ణ, నాయుడు గోపీ, జి.పూర్ణ, గుమ్మడి నాగేశ్వరరావు, పోపూరి శివరామకృష్ణ, రావుల అంజిబాబు, ధనియాల గాంధీ, వెలువోలు సాంబశివరావు పాల్గొనగా, రక్తకన్నీరు నాగభూషణం ప్రజా కళా ప్రస్థానం అనే సంచికను విడుదల చేశారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న విజయలక్ష్మి, రాధామాధవి, కౌసల్యాదేవి, రాధిక

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానందుని బోధనలు యువతలో నూతనోత్తేజాన్ని నింపి, వారిలోని అంతర్గత శక్తి, యుక్తులను మేల్కొలిపేందుకు దోహదం చేస్తున్నాయని యువజన సర్వీసులశాఖ సీఈఓ టీవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జాతీయ యువజనోత్సవ కార్యక్రమాన్ని బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన భవితకు తానే కారకుడని అన్నారు. చికాగో సదస్సులో స్వామి వివేకానందుడు చేసిన అద్భుతమైన ప్రసంగం ద్వారా భారతదేశ గొప్పతనాన్ని చాటారని, దేశంలోని ప్రజలందరి గురించి ఆయన ఎంతో పరి తపించే వారని, ముఖ్యంగా పేద పద ప్రజల మేలు కోసం ఆయన మూడురోజుల పాటు ధ్యానం చేశారని వివరించారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా యూత్ ఇన్‌చార్జి డి.కిరణ్మయి మాట్లాడుతూ స్వామి వివేకానందుడు చిన్నతనం నుంచే కులమతాలకు అతీతంగా దేశ శ్రేయస్సు కోసం ఆలోచించారని, అటువంటి వ్యక్తి మన అందరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ రాధామాధవి మాట్లాడుతూ భారతదేశంలోని గొప్ప వ్యక్తుల్లో స్వామి వివేకానంద ముందు వరుసలో ఉంటారని అన్నారు. యువతరం బలమైన దృఢ సంకల్పంతో జీవన నైపుణ్యాలను మెరుగు పరచుకుని, జీవితంలో పైకి ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వం, బృంద చర్చ, క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, స్టెప్, స్వశక్తి సూపరింటెండెంట్ తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తి అని ప్రముఖ మనస్తత్వ శాస్త్ర నిపుణుడు శ్రీధర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రేరణాత్మక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ మానవుని జీవితం కష్ట, సుఖాల మిశ్రమం అని, కష్టం వచ్చినప్పుడు కృంగిపోకుండా, సంతోషం కలిగినప్పుడు పొంగిపోకుండా ఉండాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ 'మేల్కొండి, లేవండి, గమ్యం చేరేవరకు విశ్రమించకండి, ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువత ఈ దేశానికి చాలా అవసరమని స్వామి వివేకానందుడు యువతలో ఉత్తేజాన్ని నింపారని చెప్పారు. ప్రేరణాత్మక సూక్తులతో కూడిన పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక, కళాశాల డిగ్రీ, ఇంటర్ విభాగ ఇన్‌చార్జిలు భానుమురళి, జి.సురేష్ కుమార్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్.జయ శైలజ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

డాక్టర్ శివ కళ్యాణ్



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు శివకళ్యాణ్

లక్ష్మీపురం: ఆయుర్వేద వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పీఎస్ఆర్ శివ కళ్యాణ్ అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు విశ్లేషకులు వీవీ రావ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి ఆయుర్వేదం మన జీవన విధానంలో భాగంగా ఉందని చెప్పారు. ఎన్నో రకాల వ్యాధుల నివారణకు, చికిత్సకు ప్రజలకు ఉపయోగకరంగా ఉందని వివరించారు. ఈ రోజుల్లో తరచుగా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఆయుర్వేదంతో నయం చేసే వీలుందని వివరించారు. అలాగే జీర్ణకోశ వ్యాధులు, ఎలర్జీలు, చర్మ వ్యాధులు లాంటి వాటికి కూడా మనం వంటింట్లో వాడే జీలకర్ర, మిరియాలు, శొంఠి మొదలైన వాటితో పూర్తిగా నివారించవచ్చని ఆయుర్వేద శాస్త్రం తెలియజేస్తుందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ శివ కళ్యాణ్ ని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రత్నారావు, ఉపాధ్యాయులు రత్నారెడ్డి ప్రసంగించారు.

పేదలకు సేవ చేయడం అదృష్టం



కుటుంబ సభ్యులతో కలసి వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్న రామకృష్ణయ్య, రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: పేదలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మద్దు రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం చుట్టుగుంట సెంటర్‌లోని లీలా గాయత్రి కోల్డ్ స్టోరేజీలో 250 మంది పేద వృద్ధులు, రోగులకు రూ.400 చొప్పున నాలుగు నెలల పింఛన్ రూ.ఐదు లక్షలను తమ కుటుంబ సభ్యులతో పాటు ఆవోపా నాయకులతో కలసి అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ వాసవీ మాత కృప, ఆశీస్సులతోనే పేద ప్రజలకు గత ఎనిమిది ఎనిమిదేళ్లుగా సేవ చేసే భాగ్యం తనకు దక్కిందని అన్నారు. వ్యాపార పరంగా ఆర్జించిన దానిలో కొంత మొత్తాన్ని పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వైద్య సేవా శిబిరాల నిర్వహణ, వృద్ధులు, రోగులకు ఇతోధికంగా చేయూతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మద్దు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ వైష్ణవి భావన్నారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి పట్టుకొమ్మ సంక్రాంతి



విజేతకు బహుమతి అందిస్తున్న సంఘం ప్రతినిధులు

నగరంపాలెం: తెలుగు సంస్కృతికి పట్టుకొమ్మ సంక్రాంతి పండుగ అని శ్రీచౌడేశ్వరి తొగట వీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు అనంత మల్లికార్జున అన్నారు. పాత గుంటూరు యాదవ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీచౌడేశ్వరి తొగట వీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతిలో, నూతన ఏడాదిలో వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు తెలుగు ప్రజలు వైభవంగా నిర్వహించుకుంటారని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు డైనింగ్ టేబుల్, మిక్సీ, డిన్నర్ సెట్లను అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వెనిగండ్ల కోటేశ్వరరావు, కనిగిరి రామారావు, కార్యదర్శి పూజల అర్జున్, మహిళా అధ్యక్షురాలు మాదాసు ఉషారాణి, గుండిగ ఆంతోనిబాబు, శీలం మల్లికార్జున, పట్టం రమణయ్య, వీర్నాల వెంకటేశ్వర్లు, గుమ్మళ్ల సాయిబాబా, న్యాయ నిర్ణేతలుగా రవిశేఖర్, రేవతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి రంగ వల్లుల పోటీలు



రంగ వల్లులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం ప్రారంభమైన రంగవల్లుల పోటీలు నేలకు హరివిల్లులను అద్దాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రంగవల్లుల పోటీల్లో 72 మంది పాల్గొన్నారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందిస్తామన్నారు. సోమవారం నుంచి నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు తెలుగు సంప్రదాయాన్ని చాటే వస్త్రధారణతో రావాలని కోరారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు గుంటూరు నగరానికి సంప్రదాయకమైన సొబగులు తెచ్చాయన్నారు. రంగవల్లుల పోటీల్లో మహిళలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని, ఇదే ఉత్సాహంతో మరో మూడు రోజుల పాటు జరిగే సంబరాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో జి.సురేఖ, పి.సుజాత, టి.భారతిలకు వరసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, పోటీల్లో పాల్గొన్న 6వ తరగతి విద్యార్థిని సుప్రతికి ప్రత్యేక బహుమతి, మరో 5 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నిర్వహణ కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కాశయ్య, నసీర్ అహ్మద్, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటల నుంచే సంక్రాంతి వేడుకలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు రెండో రోజు సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వీవీపీలకు పూర్ణకుంభ స్వాగతం, సన్నాయి మేళం, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, ఫుడ్ స్టాల్స్ ప్రారంభం, చిన్నారులకు భోగి పళ్లు, తాడులాగుట, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకు డప్పు వాయిద్యం, తంబోలా, సంప్రదాయ వస్త్ర పోటీలు(మహిళలు, చిన్న పిల్లలకు), చెక్క భజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ పోటీలు ఉంటాయని కమిషనర్ చెప్పారు.

కార్పొరేట్ విద్యా సంస్థల అరాచకాలు ఆగడం లేదు



సంఘీభావం తెలియజేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్పొరేట్ విద్యా సంస్థల అరాచాకలు మాత్రం ఆగడం లేదని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభల ఆదివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఫీజులు పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థలు దోచుకుంటున్నా విద్యాశాఖ అధికారులు వారిపై కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు... తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.శ్రీధర్, టి.ప్రశాంత్, అవినాష్, రాజేష్, శ్యామ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెటినోపతిపై అప్రమత్తత అవసరం

నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శివాని

గుంటూరు మెడికల్: మధుమేహాన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగా చూపును కోల్పోతున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని, వారిలో చాలామందికి రెటినోపతిపై శాస్త్రీయ అవగాహన లేకపోవడమే కారణమని అగర్వాల్ కంటి ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి.శివాని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో ఎస్‌హెచ్ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రెటినోపతి ఉచిత పరీక్ష-వైద్య సలహా శిబిరం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ శివాని మాట్లాడుతూ కంటి వెనుక భాగంలో రెటీనా ఉంటుందని, ఇది కంటి చూపు విషయంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రేటినో పతి ప్రారంభ దశలో ఉన్న ,తీవ్ర స్థాయిలో ఉన్న ఎలాంటి లక్షణాలు కనిపించవని చెప్పారు. చూపులో కూడా లోపాలు ఉండకపోవచ్చునన్నారు. అసాధారణ రక్తనాళాలు చిట్లినప్పుడే రక్తస్రావం జరిగి, కంటి లోపల రెటీనా భాగం విడిపోయి హఠాత్తుగా చూపును కోల్పోవడం జరుగుతుందని వివరించారు. అప్పుడు వారికి చికిత్స చాలా కష్టతరం అవుతుందన్నారు. అందువల్లనే మధుమేహ బాధితులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెటీనా పరీక్షలు చేయించుకోవడం చాలా మంచిదని తెలిపారు. తొలిదశలోనే రెటి నోపతిని గుర్తించి చికిత్స చేయడం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ మధుమేహం బారిన పడిన ప్రతి ఒక్కరూ రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా శరీరంలోని ప్రతి అవయవాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కె. సతీష్ కుమార్, ఎస్ సాంబశివరావు, మేకల రామారావు, టి.ఉమామహేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది పి.సుధాకర్, దంత వైద్య నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య పాల్గొన్నారు. డాక్టర్ శివాని రెటినోపతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సలహాలు అందజేశారు.

గాలి పటాలు ఎగురవేతపై అప్రమత్తంగా ఉండాలి

కొరిటెపాడు(గుంటూరు): సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు గాలి పటాలు ఎగురవేసేటప్పుడు విధిగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు దూరంగా, ఖాళీ స్థలాల్లో పతంగులు ఎగురవేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో దగ్గరుండి గాలిపటాలు ఎగురవేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సయ్యద్ హాజి ఆదాం సాహెబ్ ఆధ్వర్యంలో స్థానిక కొబాల్ట్ పేట నాలుగో లైన్ మసీదు ఆవరణలో వాసన్ కంటి ఆస్పత్రి, వారాహి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వారాహి డెంటల్‌కు చెందిన డాక్టర్ వెంకటేష్ వైద్య సలహాలు అందజేశారు. వైద్యశిబిరంలో 148 మందికి పరీక్షలు నిర్వహించి, 34 మందికి శుక్లాలు , పొరలు గుర్తించి ఎన్టీఆర్ వైద్య సేవలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని పీఆర్ఓ వెంకట్రావు తెలిపారు.